నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, మంగళవారం 9 జూలై 2024 | BHADRADRI KOTHAGUDEM

# విద్యుత్ ఉప కేంద్రాన్ని మార్చండి..

**ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి**

పర్ణశాల, జూలై 8 : గోదావరి వరదల సమయంలో తరచూ ముంపునకు గురయ్యే పర్ణశాల విద్యుత్ ఉప కేంద్రాన్ని మరో ప్రాంతానికి మార్చాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి ఆదేశించారు. పర్ణశాలలో విద్యుత్ ఉప కేంద్రాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉప కేంద్రాన్ని చిన్నబండ్రేవు గ్రామంలోని ప్రభుత్వ స్థలంలోకి మార్చాలని సూచించారు. స్థలం విషయమైన దుమ్ముగూడెం తహసీల్దార్ చంద్రశేఖర్‌తో ఆయన చర్చించారు. ఆయన వెంట డీఈ శ్రీధర్‌చారి, డీఈ కన్‌స్ట్రక్షన్ నందయ్య, భద్రాచలం డీఈ జీవన్‌కుమార్, డీఈ ఎంఆర్టీ రాంబాబు, ఏడీఈ వేణు, ఏఈ మోహన్‌రెడ్డి, విద్యుత్ సిబ్బంది ఉన్నారు.


సిబ్బందితో మాట్లాడుతున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

# మా జీవితాలతో చెలగాటం ఆడొద్దు

- ఖమ్మం జిల్లా గ్రంథాలయం ఎదుట నిరుద్యోగుల నిరసన

ఖమ్మం ఎడ్యుకేషన్, జూలై 8: తమ జీవితాలతో చెలగాటం ఆడొద్దంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని నిరుద్యోగులు హెచ్చరించారు. డీఎస్సీ పరీక్ష కోసం తక్షణమే గడువు పెంచాలని కోరారు. ఈ మేరకు ఖమ్మం జిల్లా గ్రంథాలయం ఎదుట నిరుద్యోగులు, పీడీఎస్‌యూ నాయకులు కలిసి సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హాస్టల్ వెల్ఫేర్ పరీక్షకు, డీఎస్సీకి మధ్యలో 15 రోజులు మాత్రమే గడువు ఉందని అన్నారు. ఈ క్రమంలో డీఎస్సీకి ప్రిపేర్ అయ్యే అవకాశం ఉండడం లేదని అన్నారు. అందుకని డీఎస్సీ అభ్యర్థులకు 45 రోజులు గడువు పెంచాలని డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ నాయకులు, నిరుద్యోగులు నామాల ఆజాద్, ప్రేమ్‌సింగ్, వెంకటేశ్, రమేశ్, కొండల్‌రావు, శ్రీను, మహేందర్, మమత, రాకేశ్, శ్రీనివాస్, అమర్‌నాథ్, శ్రావ్య తదితరులు పాల్గొన్నారు.


డీఎస్సీని వాయిదా వేయాలంటూ ఖమ్మంలో నిరసన వ్యక్తం చేస్తున్న నిరుద్యోగులు, పీడీఎస్‌యూ నాయకులు

# మంచి దెయ్యం..

- జిల్లాలో ఏటా పెరుగుతున్న మద్యంప్రియులు
- శరీరారోగ్యంపై బొత్తిగా అశ్రద్ధ
- పాల కంటే మందు వాడకమే ఎక్కువ
- ఏడాదిలో 2కోట్ల లీటర్లు తాగేస్తున్న మందుబాబులు
- 37లక్షల లీటర్ల పాలను వినియోగిస్తున్న జనం



భద్రాద్రి కొత్తగూడెం, జూలై 8 (నమస్తే తెలంగాణ) : 'ఆరోగ్యమే మహాభాగ్యం' అని ఏనాటి నుంచో పెద్దలు చెప్పే చక్కని మాట. ఇలాంటి మాటలు ఇప్పుడు నీతులకే పరిమితమయ్యాయి. 'పాలు తాగండి– ఆరోగ్యంగా ఉండండి' అని వైద్యారోగ్యశాఖ, వైద్యులు సైతం చెప్పే మంచిమాటలను పక్కన పెడుతున్న జనం.. మద్యం ఆరోగ్యానికి హానికరమని తెలిసి కూడా దానికే ప్రాధాన్యత ఇస్తున్నట్లు లెక్కలు చెప్తున్నాయి. మద్యం తాగుతున్న సీసాల లెక్కలు చూస్తే విస్తుపోయే నిజాలు బయటపడుతున్నాయి. నిజమేనా అంటే ఎవరైనా నిజమే అంటారు ఎందుకంటే ఈ సమాజంలో మందుకు ఇచ్చే ప్రాధాన్యత పాలకు ఇవ్వరని 'జగమెరిగిన సత్యమే' కానీ లెక్కలు చూస్తే మరింత ఆశ్చర్యమనిపిస్తున్నది.

## పాలు తక్కువ.. మందు ఎక్కువ

'చిక్కటి పాలు– చక్కటి ఆరోగ్యం' అని ఆరోగ్యశాఖ నొక్కిపట్టి చెప్పినా యువత మాత్రం మందువైపే చూస్తున్నారు.. చెడు వ్యసనాలకు బానిసలవుతున్నారు. ముఖ్యంగా కాలేజీ స్థాయి నుంచే మద్యానికి అలవాటై పెళ్లికాక ముందే రోగాల బారినపడుతున్నారు. దీంతో షుగర్, బీపీ వంటి వ్యాధులు యువతను పట్టిపీడిస్తున్నాయి. అందుకే పాల వాడకం తగ్గుతూ మద్యం వాడకం ఏడాదికేడాది పెరిగిపోతున్నది. గత ఏడాది లెక్కలు చూస్తే.. మద్యం అమ్మకాలు లీటర్లలో చెప్పుకుంటే 1,29,94,992 లీటర్లు లిక్కరు తాగగా, 80,15,670 లీటర్లు బీర్లు తాగినట్లు ఆబ్కారీశాఖ లెక్కలు చెప్తున్నాయి. కేవలం ఇది అధికారిక లెక్కలు మాత్రమే. ఇదేకాక నాటుసారా కూడా వేల లీటర్లలో విక్రయాలు అనధికారికంగా జరుగుతూనే ఉన్నాయి. అదే పాల వాడకాన్ని పరిశీలిస్తే జనాభా ప్రాతిపదికన జిల్లాలో 10,80,750 మంది ఉండగా, అందులో 2,90,190 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. ఈ కుటుంబాల్లో ఒక్కో కుటుంబం రోజుకు లీటర్లు వినియోగిస్తున్నారు. ఏడాదికి 34,82,280 లీటర్లు తాగుతున్నట్లు అంచనా. ఇదేకాక హాస్టల్ విద్యార్థులు నెలకు 36,000 లీటర్లు, అంగన్‌వాడీ చిన్నారులకు నెలకు 24,000 లీటర్లు, చిన్న నుంచి పెద్ద హోటళ్లలో వినియోగం 1,20.000 లీటర్లు, ఆసుపత్రుల్లో రోగుల కోసం వాడేది 60,000 లీటర్లుగా లెక్కలు చెప్తున్నారు. దీంతో మొత్తంగా జిల్లావ్యాప్తంగా పాల వాడకం 37,22,280 లీటర్లు వాడుతున్నారు. మందుతో పోల్చితే ఆరు రెట్లు అధికంగా వాడుతున్నట్లు తెలుస్తున్నది.

### ఆరోగ్యంపై శ్రద్ధ కరువు..

ఎన్ని రోగాలు వచ్చినా, కరోనా లాంటి మహమ్మారి కబలిస్తున్నా జనం తీరు మారడం లేదు. మందు ఆరోగ్యానికి హానికరమని తెలిసినప్పటికీ బతికుండి చేసేదేమీ లేదు... చస్తే చస్తామంటూ మందుపైనే మక్కువ చూపిస్తున్నారు. దీంతో ఏటా మద్యం అమ్మకాలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఇదే అదనుగా సర్కారు కూడా మద్యం పాలసీ కొత్త విధానాలను తీసుకొచ్చి మరీ డిపాజిట్ రేటును పెంచుతున్నది. అయినా మద్యం వ్యాపారులు మాత్రం తాగేది వాళ్లు మనకు కావాల్సింది లాభం 'ఎవరు చస్తే మనకేంటి' అంటూ వ్యాపారులు మద్యం టెండర్ల కోసం వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే మద్యంషాపుల కంటే బెల్టుషాపుల సంఖ్య రోజురోజుకు పెరగడంతో గ్రామాల్లో మద్యంప్రియులు రోడ్లపై చిందులు వేస్తున్నారు. దీంతో రోజూ వాహన ప్రమాదాలతో యువత రోడ్లపై ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారు. దీనికి తోడు గంజాయి కూడా విచ్చలవిడి కావడంతో యువత చిత్తు అవుతున్నది.

'మందు తాగితే వృద్ధాప్యం రాదట'.. ఈ మాట విన్నవారందరూ నిజమేనా అని ఆశ్చర్యపోతుంటారు.. నిజమే, వృద్ధాప్యం రాకముందే మనిషి పోతాడు. అయితే బాధాకరమైన విషయమేమిటంటే తెలిసితెలిసి మనిషి మద్యానికి నిసవుతున్నాడు. దాని కబంధహస్తాల్లో చిక్కి విలవిలలాడుతున్నాడు. ఆ మత్తులోనే చిత్తవుతున్నాడు. అధికారిక లెక్కలు చూస్తే బాధతోపాటు ఆశ్చర్యమేస్తోంది. జిల్లాలో ఏటేటా మద్యంప్రియుల సంఖ్య పెరిగిపోతున్నది. ఏడాదిలో సుమారు రెండు కోట్ల లీటర్లు తాగేస్తున్నారంటే నమ్మశక్యం కావడం లేదు. ఆరోగ్యంపై నేటి యువత, జనం బొత్తిగా శ్రద్ధచూపడం లేదని స్పష్టంగా అర్థమవుతున్నది. చక్కని ఆరోగ్యాన్నిచ్చే పాల కంటే మందే ఎక్కువగా తాగుతుండడం గమనార్హం.



# జిల్లాకు చేరిన సైన్స్ మ్యూజియం పరికరాలు

- పాత డీఈవో కార్యాలయంలో అమర్చుతున్న అధికారులు
- గంగాప్రసాద్ బిర్లాకు రూ.38 లక్షల చెల్లింపులు పూర్తి
- పరికరాల అమరికను పర్యవేక్షిస్తున్న డీఈవో, డీఎస్‌వో

ఖమ్మం ఎడ్యుకేషన్, జూలై 8: విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని, వినూత్న ఆలోచనలను పెంపొందించేందుకు ప్రయోగాలు ఎంతగానో దోహదపడతాయి. అందుకు అనుగుణంగా జిల్లాలో సైన్స్ మ్యూజియాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు అధికారులు వడివడిగా అడుగులు వేస్తున్నారు. అన్ని శాఖల కార్యాలయాలు నూతన కలెక్టరేట్‌లోకి తరలిపోవడంతో జిల్లా విద్యాశాఖకు చెందిన పాత కార్యాలయ భవనాన్ని సైన్స్ మ్యూజియం నిర్వహించేందుకు కేటాయించారు. ఈ భవనంలో సైన్స్ మ్యూజియం నిర్వహించేందుకు అనువుగా మార్పులు చేర్పులు చేశారు. గత ప్రభుత్వాలు జిల్లాలో ప్రతిష్ఠాత్మకంగా సైన్స్ మ్యూజియం నెలకొల్పేందుకు మొదటి విడతగా రూ.20 లక్షలు, రెండో విడతగా రూ.10 లక్షలు విడుదల చేశాయి. ఈ నిధులను డీఆర్‌వో, డీఎస్‌వో జాయింట్ అకౌంట్‌లో ఉంచారు. ఈ నిధులు 2014 నుంచి ఇప్పటి వరకు వడ్డీతో కలిపి రూ.46 లక్షలై అందుబాటులో ఉన్నాయి. ఈ నిధులను వెంటనే సైన్స్ పరికరాల కోసం వినియోగించి మ్యూజియాన్ని ఏర్పాటు చేసి ఈ విద్యాసంవత్సరంలోనే అందుబాటులోకి తెచ్చేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.


మ్యూజియంలో సైన్స్ పరికరాలను పరిశీలిస్తున్న డీఈవో, ఇతర అధికారులు

## 27 రకాల సైన్స్ పరికరాలు..

సైన్స్ మ్యూజియంలో సైన్స్ పరికరాలను అమర్చేందుకు గంగా ప్రసాద్ (జీపీ) బిర్లా సంస్థ ప్రతినిధులను జిల్లా అధికారులు సంప్రదించారు. 6 నుంచి 10 తరగతుల వరకు గల సైన్స్ సబ్జెక్టుల్లోని పాఠాల్లో అవసరమైన సైన్స్ మ్యూజియంలో అమర్చేందుకు వివరాలను అందించారు. విద్యాశాఖ అధికారులు వాటిని ఆమోదించి టెండర్‌ను ఖరారు చేశారు. దీనిలో భాగంగా సోమవారం జీపీ బిర్లా సంస్థ ప్రతినిధులు సైన్స్ మ్యూజియంలో ఉంచాల్సిన పరికరాలను జిల్లాకు చేర్చారు. వీటిని సైన్స్ మ్యూజియంలోని మొదటి అంతస్తులో అమర్చుతున్నారు. 27 రకాల సైన్స్ పరికరాలను సంస్థ సిబ్బంది ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటూ వాటికి కేటాయించిన స్థానంలో అమర్చుతున్నారు.

## రూ.38 లక్షల చెల్లింపులు పూర్తి..

సైన్స్ పరికరాల కోసం కేటాయించిన రూ.40 లక్షల్లో రూ.38 లక్షలను జీపీ బిర్లా సంస్థకు విద్యాశాఖాధికారులు చెల్లించారు. పెండింగ్‌లో ఉన్న రూ.2 లక్షలను సైన్స్ మ్యూజియం అందుబాటులోకి వచ్చిన తర్వాత చెల్లించనున్నారు. సైన్స్ మ్యూజి యం కోసం కేటాయించిన భవనంలో మార్పులు చేసినందుకు రూ.16.50 లక్షలు కేటాయించారు. వాటి చెల్లింపులను సైతం పూర్తి చేశారు. మ్యూజియానికి సీఎస్ఆర్ ఫండ్స్ కింద నివోసాల్ సంస్థ రూ.20 లక్షలను డొనేషన్‌గా అందించింది.

## పర్యవేక్షిస్తున్న డీఈవో, డీఎస్‌వో..

సైన్స్ మ్యూజియంలో జరుగుతున్న పనులను డీఈవో సోమశేఖరశర్మ, డీఎస్‌వో జగదీశ్వర్ పర్యవేక్షిస్తున్నారు. ఈ నెల చివరికల్లా పూర్తిస్థాయిలో అన్ని పరికరాలనూ అమర్చి అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. సైన్స్‌కి సంబంధించిన కార్యక్రమాలను సైన్స్ మ్యూజియం వేదికగా నిర్వహించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

# బలమైన విద్యావ్యవస్థతోనే సమగ్రాభివృద్ధి

**ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి**

కూసుమంచి, జూలై 8 : బలమైన విద్యావ్యవస్థతోనే యువతకు ఉజ్వల భవిష్యత్, సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని, ఆ దశగా ఖమ్మం పార్లమెంట్ పరిధిలో గిరిజన యూనివర్సిటీ, కరీంనగర్ తరహాలో గ్రంథాలయం, కొత్తగూడెంలో విమానాశ్రయం ఏర్పాటుకు కృషి చేస్తానని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి అన్నారు. కూసుమంచిలోని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయంలో సోమవారం ప్రజల నుంచి వినతులు స్వీకరించడంతోపాటు ఆయన విలేకరులతో మాట్లాడారు. కొత్తగూడెంలో విమానాశ్రయం ఏర్పాటుతో పారిశ్రామిక ప్రాంతంగా పురోగతి సాధిస్తుందని, ఆ దిశగా ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. గిరిజనులు అత్యధికంగా ఉన్న ప్రాంతం కావడంతో ఒక గిరిజన యూనివర్సిటీ, ఖమ్మంలో మరో యూనివర్సిటీ ఏర్పాటు కావాల్సి ఉందని, వాటి ప్రాధాన్యత గురించి జిల్లా మంత్రులతో చర్చించి ప్రభుత్వానికి నివేదిస్తానని తెలిపారు. ఇటీవల కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రానికి చెందిన ఎంపీలను తీసుకెళ్లి సైనిక్ స్కూల్స్ కావాలని అడిగినట్లు తెలిపారు. అయితే గత ఏడాది క్రితం సైనిక్ స్కూళ్లు తీసివేశారని, ప్రైవేట్ పరిధిలో ఏర్పాటుకు అవకాశం ఇస్తామని తెలిపినట్లు ఆయన పేర్కొన్నారు. ఖమ్మం నగరంలో నిరుద్యోగ యువత కోసం కరీంనగర్ తరహాలో ఒక గ్రంథాలయాన్ని నిర్మిస్తామని, ఇందుకోసం త్వరలోనే కరీంనగర్ వెళ్లి గ్రంథాలయాన్ని పరిశీలిస్తామని తెలిపారు. సమావేశంలో నాయకులు కంచర్ల చంద్రశేఖర్, భీమినేని శ్రీనివాసరెడ్డి, బజ్జూరి వెంకటరెడ్డి, రామసహాయం బాలకృష్ణారెడ్డి, మంకెన వాసు, ఎడవల్లి రాంరెడ్డి పాల్గొన్నారు.


ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తున్న ఎంపీ రఘురాంరెడ్డి



# వెన్నెలంత సందడి..

జాలువారుతున్న జలధారలు. షవర్‌ను తలపించే మాదిరిగా నీటి తుంపరలు. చూసేకొద్దీ చూడాలనిపించే జలసవ్వడులు, తనివితీరని దృశ్యాలు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం హనుమాన్ ఆలయ సమీపంలోని రథంగుట్టపై నుంచి వెన్నెల జలపాతం కనువిందు చేస్తోంది. ఏజెన్సీ ప్రాంతంలో వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు కొత్త నీటితో జలపాతం సవ్వడి చేస్తోంది. సోమవారం స్థానికులు, పర్యాటకులు ఈ జలపాతాన్ని సందర్శించడంతోపాటు నీటిలో సందడి చేస్తూ కేరింతలు కొట్టారు. వెన్నెల జలపాతం వద్ద అటవీ శాఖ అధికారులు పర్యాటకులకు ఇబ్బంది కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో ఈ ప్రాంతం జాతరను తలపిస్తోంది. *- మణుగూరు టౌన్, జూలై 8*

# 'పదవుల' పందేరం

- కార్పొరేషన్ చైర్మన్లుగా ఉమ్మడి జిల్లా నుంచి ఆరుగురు
- కాంగ్రెస్‌లో పలువురు సీనియర్లకు మొండిచేయి
- అసంతృప్తిలో మరికొందరు 'హస్తం' పార్టీ నేతలు


పొదెం వీరయ్య, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్


సత్యనారాయణ, హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్


విజయ్‌బాబు, నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్


జనక్‌ప్రసాద్, కనీస వేతనాల చట్టం అమలు సంస్థ చైర్మన్


రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్


నూతి శ్రీకాంత్, రాష్ట్ర బీసీ ఆర్థిక సహకార సంస్థ చైర్మన్

ఖమ్మం, జూలై 8 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కాంగ్రెస్ ప్రభుత్వం తాజాగా ప్రకటించిన పదవుల పందేరంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి ఆరుగురికి అవకాశం లభించింది. రాష్ట్రస్థాయిలో వివిధ కార్పొరేషన్లకు వీరిని చైర్మన్లుగా నియమించింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. గత శాసనసభ ఎన్నికల్లో భద్రాచలం నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలైన పొదెం వీరయ్యను రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా కాంగ్రెస్ ప్రభుత్వం నియమించింది. అలాగే పాలేరు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిత్వం కోసం చివరి నిమిషం వరకు వేచి చూసిన రాయల నాగేశ్వరరావుకు రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ పదవిని కట్టబెట్టింది. అలాగే డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబును రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా నియమించింది. తిరుమలాయపాలెం మండలానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, సింగరేణి కార్మిక సంఘం నాయకుడు జనక్‌ప్రసాద్‌ను కనీస వేతనాల చట్టం అమలు సంస్థ చైర్మన్‌గా నియమించింది. వైరా నియోజకవర్గానికి చెందిన, ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉంటున్న నాయుడు సత్యనారాయణకు రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా, అదే వైరా నియోజకవర్గానికి చెందిన నూతి శ్రీకాంత్‌ను రాష్ట్ర బీసీ ఆర్థిక సహకార సంస్థ చైర్మన్‌గా నియమించింది. ఈ నామినేటెడ్ పదవులను రాష్ట్ర ప్రభుత్వం లోక్‌సభ ఎన్నికలకు ముందే ఖరారు చేసింది. అయితే ఎన్నికల కోడ్ అమలులో ఉండడం వల్ల అధికారిక ఉత్తర్వులు జారీ చేయలేదు. గత మార్చిలో ప్రకటించిన కార్పొరేషన్ పదవుల్లో మువ్వా విజయ్‌బాబు పదవి మాత్రమే మారింది. ఆయనకు తొలుత విద్యావసరుల అభివృద్ధి సంస్థ చైర్మన్ పదవిని కేటాయించారు. కానీ.. తాజాగా ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించారు. కాగా, దశాబ్దాలుగా కాంగ్రెస్ జెండా మోస్తున్న అనేకమంది సీనియర్లు, మరికొందరు నాయకులు ఈ నామినేటెడ్ పదవులను ఆశించినప్పటికీ వారికి ఆ పదవులు లభించలేదు. దీంతో ఆయా వర్గాల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది.

# జిల్లా సమగ్రాభివృద్ధికి.. ప్రణాళికాబద్ధ చర్యలు చేపట్టాలి

- తాగునీటి సమస్యలను వెనువెంటనే పరిష్కరించాలి
- సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి
- ఖమ్మం కలెక్టర్, సీపీల సమావేశంలో మంత్రి తుమ్మల

మామిళ్లగూడెం, జూలై 8: జిల్లా సమగ్రాభివృద్ధి కోసం ప్రణాళికాబద్ధ చర్యలు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. ఖమ్మం ఐడీవోసీలోని కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, సీపీ సునీల్‌దత్‌లతో సోమవారం మంత్రి తుమ్మల సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. మిషన్ భగీరథ నీటి సరఫరాలో సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. నగరంలో తాగునీటి కొరత తలెత్తకుండా చూడాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణకు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని సూచించారు. యువతకు మత్తు పదార్థాలను చేరవేసే ముఠాలను గుర్తించి కఠిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కాగా, కలెక్టరేట్‌కు వచ్చిన మంత్రికి సమస్యల పరిష్కారం కోసం ప్రజలు అర్జీలు సమర్పించారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన మంత్రి.. వాటిని కలెక్టర్‌కు అందజేశారు. ఆయా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.


ఖమ్మం ఐడీవోసీలో వినతులు తీసుకుంటున్న మంత్రి తుమ్మల

# అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వండి

**ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**

మామిళ్లగూడెం, జూలై 8 : వివిధ ప్రాంతాల నుంచి బాధితులు వచ్చి సమర్పించిన అర్జీల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి.మధుసూదన్‌నాయక్‌తో కలిసి పాల్గొన్న కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని తెలిపారు. ధరణి భూ సమస్యలపై వచ్చిన దరఖాస్తుల స్థితిగతులను ఆన్‌లైన్‌లో పరిశీలించి వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత తహసీల్దార్లకు ఆదేశాలు జారీ చేశారు. ఖమ్మం అర్బన్ మండలం ధంసలాపురం నుంచి పాశం బ్రహ్మారెడ్డి, ఖానాపురానికి చెందిన భట్టు నాగమణి, బోనకల్ మండలం రావినూతలకు చెందిన బి.మంగమ్మ, తల్లాడ మండలం పినపాకకు చెందిన ఎస్‌కే.మైబూబీ, చింతకాని మండలం ప్రొద్దుటూరుకు చెందిన షేక్ జాన్ సాహెబ్, కొణిజర్ల మండలం పెద్దగోపతికి చెందిన మాచర్ల సైదమ్మ తదితరులు తమ తమ సమస్యలపై వినతులు సమర్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్, డీఆర్డీవో సన్యాసయ్య, జడ్పీ సీఈవో ఎస్.వినోద్, డీఆర్వో ఎం.రాజేశ్వరి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.


వినతులు స్వీకరిస్తున్న ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

# దరఖాస్తులు సత్వరమే పరిష్కరించండి

**భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్**

భద్రాద్రి కొత్తగూడెం, జూలై 8 (నమస్తే తెలంగాణ) : ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీవోసీ కార్యాలయ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందనతో కలిసి అన్ని శాఖల అధికారులతో ప్రజావాణి నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల దరఖాస్తులను స్వీకరించి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ దరఖాస్తు చేసిన అభ్యర్థుల వివరాలు అడిగి తెలుసుకొని పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అలాగే సాధారణ బదిలీల్లో భాగంగా అన్ని శాఖల అధికారులు తమ సిబ్బంది బదిలీల దరఖాస్తులను ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు సమర్పించాలని సూచించారు. 13 నుంచి 18వ తేదీ వరకు వచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తామని, తర్వాత ప్రభుత్వ ఆదేశాల మేరకు బదిలీలు చేపడతామని తెలిపారు. ప్రభుత్వ అధికారులందరూ సమయపాలన పాటించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.


ప్రజావాణిలో విజ్ఞప్తులు స్వీకరిస్తున్న భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్